**పింఛను వచ్చేలా పెట్టుబడి..**




నాకు ఇటీవలే వివాహం అయ్యింది. ఇద్దరమూ ఉద్యోగులమే. ఐదేళ్లలో ఇల్లు కొనాలని ఆలోచిస్తున్నాం. మేమిద్దరం కలిసి నెలకు రూ.20వేల వరకూ పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాం. ఇద్దరికీ ఉమ్మడిగా ఒక టర్మ్ పాలసీ తీసుకోవచ్చా? పెట్టుబడి ప్రణాళిక ఎలా ఉండాలి?

- ప్రశాంత్

మీకు ఐదేళ్ల వ్యవధి ఉంది కాబట్టి, కాస్త నష్టభయం ఉన్నప్పటికీ అధిక రాబడి రావాలంటే.. మీరు హైబ్రీడ్ ఈక్విటీ ఫండ్లను ఎంచుకోవచ్చు. ఇందులో మీకు 11 నుంచి 12 శాతం వరకూ రాబడి వచ్చే అవకాశం ఉంది. దీనికి మీరు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఈక్విటీ అండ్ డెట్ ఫండ్, ఎల్అండ్టీ హైబ్రీడ్ ఈక్విటీ ఫండ్, మిరే అసెట్ హైబ్రీడ్ ఈక్విటీ ఫండ్లను ఎంచుకోండి. వీటికోసం రూ.12,000 కేటాయించండి. మిగతా రూ.8,000లను డెట్ ఫండ్లలో మదుపు చేయండి. దీనికోసం ఫ్రాంక్లిన్ ఇండియా షార్ట్ టర్మ్ ఇన్కం ప్లాన్, యూటీఐ క్రెడిట్ రిస్క్ ఫండ్లను పరిశీలించవచ్చు. ఇద్దరికీ కలిపి ఉమ్మడిగా టర్మ్ పాలసీ తీసుకోవడానికి బదులు.. వేర్వేరుగా తీసుకోవడమే ఉత్తమం. ఈ పాలసీలను మంచి చెల్లింపుల చరిత్ర ఉన్న రెండు వేర్వేరు సంస్థల నుంచి తీసుకునేందుకు ప్రయత్నించండి.

నేను మరో రెండేళ్లలో పదవీ విరమణ చేయబోతున్నాను. ఏదైనా బీమా పాలసీ తీసుకొని, నెలకు రూ.30,000 చెల్లించాలని అనుకుంటున్నాను. రెండేళ్ల తర్వాత దీని నుంచి పింఛను తీసుకునేలా ఉండాలి. అలాంటివేమైనా అందుబాటులో ఉన్నాయా?

- రాజారాం

మీరు బీమా పాలసీలను ఎంచుకొని, రెండేళ్ల తర్వాత పింఛను రావాలంటే.. డిఫర్డ్ యాన్యుటీ పథకాలను ఎంచుకోవాలి. కానీ, యాన్యుటీ పథకాల్లో 6-6.5శాతం వరకూ రాబడి వచ్చే అవకాశం ఉంది. ఇంతకంటే మెరుగ్గా రాబడి రావాలంటే.. ఈ రూ.30,000లను బ్యాంకులో రెండేళ్ల పాటు రికరింగ్ డిపాజిట్ చేయండి. పదవీ విరమణ తర్వాత ఈ డబ్బును తీసుకుని, సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీంలో పెట్టుబడి పెట్టాలి. ఇందులో ప్రతి మూడు నెలలకోసారి వడ్డీ చెల్లిస్తారు. ఇలా చేయడం వల్ల మీకు యాన్యుటీ పథకాలకన్నా అధిక రాబడి వచ్చే ఆస్కారముంది.

మా అబ్బాయి వయసు 3ఏళ్లు. మా వారు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. మా బాబు భవిష్యత్తు కోసం నెలకు రూ.5వేల వరకూ మదుపు చేయాలనే ఆలోచనతో ఉన్నాం. ఇప్పటి వరకూ ఎలాంటి పెట్టుబడీ పెట్టలేదు. మాకు సరిపోయే పథకాలను సూచించండి.

- స్వాతి

ముందుగా మీ బాబు, మీ కుటుంబ భవిష్యత్తు అవసరాలకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రయత్నించాలి. దీనికోసం మీ వారి వార్షికాదాయాన్ని బట్టి, దానికి 10-12 రెట్ల టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోండి. కనీసం రూ.3లక్షల విలువైన ఫ్యామిలీ ఫ్లోటర్ ఆరోగ్య బీమా తీసుకోండి. వ్యక్తిగత ప్రమాద, డిజేబిలిటీ ఇన్సూరెన్స్ కూడా అవసరమే. మీ బాబు చదువు కోసం ప్రత్యేకంగా పెట్టుబడి పెట్టాలనుకున్నప్పుడు.. విద్యా ద్రవ్యోల్బణానికి మించి అధిక రాబడి వచ్చేలా చూసుకోవాలి. అప్పుడే పెరుగుతున్న చదువుల ఖర్చులను తట్టుకునే అవకాశం ఉంటుంది. వీటికి ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవడమే ఉత్తమ మార్గం. దీనికి మీరు మిరే అసెట్ ఇండియా ఈక్విటీ ఫండ్, ఫ్రాంక్లిన్ ఇండియా ప్రైమా ఫండ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఈక్విటీ ఫండ్లను పరిశీలించవచ్చు. పదవీ విరమణ తర్వాత అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకొని, మదుపు చేయడం కూడా ముఖ్యమే. దీనికోసం కేటాయించే మొత్తంలో 50శాతాన్ని పీపీఎఫ్‌లోనూ, మిగతా మొత్తాన్ని డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలోనూ మదుపు చేసేలా చూసుకోండి.

బంగారం కొనేందుకు నెలకు రూ.10వేల చొప్పున పెట్టుబడి పెట్టాలనుకుంటున్నా. ఐదేళ్ల వరకూ మదుపు చేయగలను. దీనికోసం ఎలాంటి పథకాలను ఎంచుకోవాలి?

- స్వప్న

మీరు బంగారంలో మదుపు చేయాలనుకుంటే.. గోల్డ్ ఫండ్లు, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో నెలనెలా సిప్ విధానంలో ఈ ఫండ్లలో మదుపు చేయొచ్చు. బంగారం ధరలను బట్టి, ఈ పెట్టుబడి పథకాల పనితీరు ఆధారపడి ఉంటుంది. పసిడిని కొనాలనుకున్న రోజున ఈ పథకాల్లో నుంచి డబ్బు వెనక్కి తీసుకొని, మీకు కావాల్సిన బంగారాన్ని కొనుగోలు చేయొచ్చు. యూటీఐ గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లను గమనించవచ్చు.

నేను అమెరికాలో ఉంటున్నాను. నేను హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఒక ప్రముఖ బ్యాంకులో డీమ్యాట్ ఖాతా ఉంది. దాని ద్వారా ఆన్‌లైన్‌లో నేరుగా మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేసే అవకాశం ఉందా? ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలా?

- విష్ణు

మీరు ఇప్పుడు ప్రవాస భారతీయులుగా ఉన్నారు కాబట్టి, మీ కేవైసీని మార్చుకోవాలి. మీ డీమ్యాట్ ఖాతాలో పొదుపు ఖాతా నమోదై ఉంటుంది. దీనికి బదులుగా ఎన్‌ఆర్‌ఈ లేదా ఎన్‌ఆర్‌ఓ ఖాతాను జత చేయాలి. ఇది పూర్తయిన తర్వాతే మీరు పెట్టుబడి గురించి ఆలోచించాలి.

- **తుమ్మ బాల్‌రాజ్**, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్